కథ

# దేవుడే దిగివస్తే

-పి. ఉమా సరస్వతి

> భగవంతుడన్నంత మాత్రాన అందరి ఆపదలు, కోర్కెలు తు.చ. తప్పకుండా తీర్చాలా ఏమిటి? ఎవరి అర్హతని పాత్రతని బట్టి వారికి వరప్రదానం చేస్తాడు గానీ కోరినవారందరికీ కోరినవన్నీ ప్రసాదిస్తాడా ఏమిటి ?

**ఏమిటా** జనసందోహం ? ఏమిటా కోలాహలం? తండోపతండాలుగా విచ్చేస్తున్నారు జనం. ఇసుక వేస్తే రాలకుండా వున్నారు. ఏం జరుగుతుందో అర్థం కావటం లేదు. ఎవరైనా అటు నుంచి వచ్చేవాళ్లుంటే అడిగి తెలుసుకోవచ్చు అనుకుంటూ ఎదురుచూస్తోంది అర్చన అటువైపు నుంచి వచ్చేవాళ్లెవరైనా వున్నారేమోనని. అక్కడ విషయమేమిటో తెలుసుకోవచ్చుకదానని. ఇంతలోనే "అమ్మా ! తలుపు తీయండి" అంటూ పనిమనిషి కేక వినిపించింది. లోపలికి వెళ్లి సందు తలుపు తీసింది అర్చన. ఏం జరుగుతుందో అడిగే లోపలే చెప్పడం మొదలు పెట్టింది పనిమనిషి లింగమ్మ.

"ఏవిటోనమ్మా విడ్డూరం. ఆ వైకుంఠంలో వున్న విష్ణుమూర్తే సాక్షాత్తు భూలోకంలోకి వచ్చాడంట. కలియుగంలో భూలోకంలో మానవులనందరిని వుద్ధరించాలని. అయినా విష్ణుమూర్తి అయితే నాలుగు చేతుల్తో వుండాలి కదా ! ఈ దిగివచ్చిన విష్ణుమూర్తి ఏమాత్రం మన పటాల్లో చూసే విష్ణుమూర్తిలా లేడు మరి. మనందరిలా సాధారణ మనిషిలాగానే వున్నాడు. ఆ వున్న రెండు చేతుల్లో కూడా ఏ ఆయుధాలు లేవమ్మగారూ. అయినా సరే ఆయన సాక్షాత్తూ విష్ణుమూర్తే నంటూ జనాలు వేలం వెర్రిగా నమ్ముతున్నారు. ఏం చూసి ఆయన్ని విష్ణుమూర్తే అని నిర్ధారించారో మరి అర్థం గావడంలేదు."

"అదేమి చోద్యమే మరీనూ ! అలా ఎలా నమ్ముతున్నారు ఈ జనాలు ? అయినా ఏమోలే ఆ గజేంద్రుడు మొసలి చేత జిక్కినప్పుడు మొర పెట్టుకుంటే ఆలకించి "సిరికిం చెప్పడు" అన్నట్టు ఉన్నవాడు ఉన్న పళంగా వచ్చేశాడంటారు భాగవతంలో పోతనగారు. అలాగే యిప్పుడూ గజేంద్రుడు లాంటి భక్తులే ఎవరో మొరపెట్టుకుని వుంటారేమో ! అందుకే అలా ఏ ఆయుధాలు, మంది మార్బలం లేకుండా ఉన్న పళంగా పరిగెత్తుకొని వచ్చి వుంటాడు. అయినా సర్వశక్తిమంతుడైన భగవంతుడు భక్తులను రక్షించాలంటే ఆయుధాలు వుంటే తప్పుకాదా ఏమిటి ? అయినా మన పటాలలో చూచినట్లే శంఖచక్ర గదా పద్మాలతో వూడి పడ్డాడే అనుకో. ఈ జనాలంతా ఆయన ఎదుట అక్కడ నిలబడి వుండేవారా ? అయినా కలియుగంలో జనాలంతా పాపభూయిష్ఠులైన వారు గదా ! ఆయన ఎదుట తల ఎత్తుకుని నిలబడ గలగాలి అంటే ఎన్ని గుండెలుండాలి ? భగవంతుడికైనా ఆయన్ని గుర్తించే మానవులుంటేనే గదా ఆయనకు ఉనికీ, మనుగడానూ. అందుకే కాబోలు ముందు జాగర్త పడి వుంటాడు. అయినా ఒకసారి వెళ్లి దర్శనం చేసుకొద్దాం పద నీ పని తొందరగా కానీ" అంటూ లింగమ్మను తొందర చేసింది అర్చన. లింగమ్మ పని అయిపోగానే యిద్దరూ కలిసి వెళ్లారు ఆ జనంలోకి. ఎవరి ఆలోచనలు వాళ్లవి. ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. "సాక్షాత్తు విష్ణుమూర్తే దిగి వచ్చారంటారు, ఏ రకంగా ఆయన విష్ణుమూర్తిలా వున్నాడంటారు ? అలంకార ప్రియుడంటారుగా ? మచ్చుకైనా ఏ అలంకారం కనిపించడం లేదు. పోనీ ఆపన్న ప్రసన్నుడంటారు గదా ఎంతమంది ఆపదలు తీర్చాడు ? తీరినవారు దేవుడంటే తీరని వాళ్ళు 'దగాకోర్ మోసగాడు' అంటున్నారు. భగవంతుడన్నంత మాత్రాన అందరి ఆపదలు, కోర్కెలు తు.చ. తప్పకుండా తీర్చాలా ఏమిటి ? ఎవరి అర్హతని, పాత్రతని బట్టి వారికి వరప్రదానం చేస్తాడు గానీ కోరినవారందరికీ కోరినవన్నీ ప్రసాదిస్తాడా ఏమిటి ?" అని కర్మ సిద్ధాంతాన్ని కాస్తో కూస్తో నమ్మినవారిమాట. ఇలా ఎవరికి తోచినట్లు వారు తలా ఒక మాటా మాట్లాడు తున్నారు.

భగవంతుడి మీద పరిపూర్ణ విశ్వాసం వుండటం చేతనో ఏమో అర్చనకి అక్కడ గుమిగూడిన జనం మాటలు కొంచెం బాధకల్గించాయి. భగవంతుడు నిజంగా దిగివచ్చినా నమ్మే సంస్కారం, మనసూ వుండొద్దూ ! అయినా యిదేదో త్రేతాయుగమో, ద్వాపరయుగమో కాదుగదా ! త్రేతాయుగంలో రాములవారిని అవతార పురుషుడని ఎంతోమంది గ్రహించారు, సేవించారు. ద్వాపరంలో కృష్ణావతారంలోనూ ఎంతోమంది ఆయన్ని షోడశ కళాప్రపూర్ణుడిగా గుర్తించి షోడశోపచారాలు చేశారు అంటే ఆ యుగాల్లో ధర్మం కాస్తో కూస్తో నిలబడి వుంది గనుక, ఎవరో కొద్దిమంది దురదృష్టవంతులు వారిని భగవంతుడిగా గుర్తించకపోయినా కాని ఇది కలియుగం కదా ! ధర్మం ఒంటి కాలిమీద కుంటినడక నడుస్తున్న ఈ తరుణంలో సర్వజనోద్ధరణకని వైకుంఠం నించి బయులుదేరి భూలోకంలో ఎందుకు అడుగుపెట్టినట్టు ఈ విష్ణుమూర్తి? నలుగురూ నాలుగు మాటలు అంటూంటే అవన్నీ భరించి సహించి ఈ భూలోకానికి రావలసిన అగత్యం ఏం బట్టింది కనుక ఆయనికి ? ఏదో మేలు చేయాలని వస్తే కీడే ఎదురైంది ? అయినా ఈ మధ్యకాలంలో గల్లీకి ఒక గాడ్ ఫాదర్ నేనంటూ వెలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన స్వయంగా దిగివచ్చి ఏదో పొడిచేద్దాం అంటే జనాలు మాత్రం ఎంతవరకు నమ్ముతారు ? వాళ్లని తప్పు పట్టడం మాత్రం ఎంతవరకు సబబు ? అయినా రాజే తలచుకుంటే దెబ్బలకు కొదవా ? అన్నట్లు ఆయన తలచుకుంటే ఉన్నచోట కూర్చునే తాను చేయదలచుకున్న సంస్కరణలు చేయలేడా? అయినా పనిగట్టుకొని భూలోకానికొచ్చి నలుగురి చేత చీపురు దెబ్బలు తింటాడా ఏమిటి ? ఇలా సాగుతున్నాయి అర్చన మనసులో ఆలోచనలు. ఉన్నట్టుండి జనాల్లో ఆందోళన, ఆశ్చర్యం, విస్మయం లాంటి భావాలు చోటు చేసుకున్నాయి. విషయం ఏమిటో అర్థం కావడానికి కొంత సమయం పట్టింది. వైకుంఠం నుంచి వచ్చిన విష్ణుమూర్తి ఉన్న పళంగా అదృశ్యమై పోయాడట. కారణం తెలియని జనం తెల్ల మొహాలు వేసుకుని నిశ్చేష్టులై నిలబడి పోయారు. అర్చన మాత్రం ఆ విష్ణుమూర్తి తన మనోభావాలు గుర్తించి నట్టున్నాడు మంచి నిర్ణయమే తీసుకున్నాడు అనుకొని హాయిగా వూపిరి పీల్చుకొని యింటి దారి పట్టింది లింగమ్మను తన యింటికి పంపిస్తూ.

❄ ❄ ❄

కవిత

# నగరంలో... వాన

భాగ్యనగరంలో చిరు జల్లులు... జల్లులు
ఆ భాగ్యానికే నగర జీవుల విల విలలు
ట్రాఫిక్ జాంలు... గంటలు గంటలు
అందరిలోనూ అసహనపు మాటలు మాటలు
బిడ్డలను పంపితే పరీక్షలకై
తిరిగివచ్చు దాకా తల్లితండ్రులకు తప్పదు పరీక్ష
రెక్కాడితేగాని డొక్కాడని కూలి
పోవచ్చు ఏ గోడైనా కూలి....
మింగేయడానికి మ్యాన్‌హోల్‌లు సిద్ధం
తిరిగే ఈ జీవులకు జర ఎక్కడుంది భద్రం
మోకాలి నీటిలో ఈదే పరిస్థితి
మొక్కాలి దేవుడిని తలచుకుని.... ఈ దుస్థితి.

- టి.శంకరరావు